

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే వెంకటేష్

అంబర్‌పేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ కుమ్మరివాడిలో రూ.7.5లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్రమబద్ధంగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల వల్లే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

● ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల వల్లే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధించాడని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం హైదరాబాద్‌లో అభివృద్ధి విషయంలో భరోసా ఇచ్చారని ప్రజలు నమ్మకంతో ఓట్లువేసి గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే సీఎం యువకుడైన నవీన్‌యాదవ్‌కు టికెట్ కేటాయించి గెలిపించారన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వంద డివిజన్లలో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తూ పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దాలని సూచించారు.

నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులు కావాలి

చిక్కడపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులు కావాలని కేంద్ర మాజీమంత్రి డా సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. వికెఎస్ శరణ్య వెల్ఫేర్ సొసైటీ, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం, చాచానెహ్రూ చెకుముకి అవార్డు ప్రదానోత్సవం జరిగింది. సంఘసేవకులు డా.మునగా రామ్మోహనరావు, మహ్మద్, రాధ కుసుమ, మురళీమోహన్‌రాజు, బాబు పాల్గొన్నారు. పాయల్‌శర్మ, సిద్దిగొండ ఆర్తి, నీతుకుమారిచౌదరి, వైభవ్‌శర్మ, కలాల్ వచనశ్రీ, రాజేశ్వర్, మునేష్, ఆశ్రీత్‌లను అవార్డులతో సత్కరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని వినోభానగర్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కొత్త పైప్‌లైన్‌లు వేస్తున్నారని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం వినోభానగర్‌లో రూ.6.74 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి అధికారులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త పైప్‌లైన్‌లు వేయడం వల్ల స్థానికంగా డ్రైనేజీ సమస్య పరిష్కారం కావడంతోపాటు కలుషిత నీటి సరఫరాను నివారించవచ్చన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాలతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, సత్యనారాయణ బాబు, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు చేయాలని ఎయిర్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా



ధర్నాలో ఎయిర్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు

కవాడిగూడ : తగిన పెన్షన్ మంజూరు చేయాలని న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎయిర్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు ఇందిరా పార్కు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిర్ ఇండియా రిటైరీస్ కన్వీనర్ బి ఆర్ రవీందర్, కోకన్వీనర్ ఆశీర్వాదంలు మాట్లాడుతూ ఎయిర్ ఇండియాను 2021 డిసెంబరులో టాటాకు విక్రయించారని నాటినుంచి పదవీ విరమణ చేసిన వారికి మంచి పెన్షన్, వైద్య సదుపాయాలు ప్రియారిటీ వంటి కనీస ప్రయోజనాలను విస్తరించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పదవీ విరమణ చేసిన వారికి మంచి పెన్షన్‌తో పాటు వైద్య, ప్రియారిటీ ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రిటైర్డ్ ఉద్యోగులు ఉమేష్, మురళి, డిదాన్, వినాయక్‌రావు, రాజగోపాల్, నిత్యానంద్, మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు బంగారు పతకాలు



స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రాంనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : చిక్కడపల్లి, ఉప్పల్‌లోని అరోరా పీజీ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ వేదిక స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓయూ డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ సెల్ ప్రొఫెసర్ ఎన్.కిషన్ హాజరు కాగా శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్, సాహా సైంటిస్ట్ జీఎస్ఎల్‌డీఆర్‌డీఓ డాక్టర్ సంజయ్‌కుమార్, ఐడియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కట్ట, ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి పాల్గొన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. టాప్ టెన్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎక్సలెన్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అరోరా గ్రూప్ చైర్మన్ నిమ్మటూరి అనుదీప్, డైరెక్టర్ ప్రదోష్‌చంద్ర పట్నాయక్, డాక్టర్ ఆర్.సుష్మ, బి.సంతోష్‌కుమార్, ఎం.సుందరం, డాక్టర్ నజియా ఆఫ్రోజ్, ఆర్.అర్జున్‌రావు పాల్గొన్నారు.



బిబి పాటిల్‌ను సన్మానిస్తున్న బండారు దత్తాత్రేయ

సమాజసేవ చేసేవారిని సన్మానించాలి

చిక్కడపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేసేవారిని సన్మానించుకోవాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కళానిలయం, ప్రగతిశీల వీరశైవ సేవా సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రగతిశీల వీరశైవ సేవా సమాజం అభివృద్ధికి సహకరిస్తున్న మాజీ ఎంపీ బి బి పాటిల్‌ను సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు అభివృద్ధిపథంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, కేంద్రమాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, స్వామి స్థితప్రజ్ఞానందసరస్వతి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభివృద్ధి పనులపై దృష్టి : కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి : ప్రజాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి వహిస్తున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ఆరు ప్రాంతాలు కెనరాబ్యాంక్, అబ్బాయి టిఫిన్స్, సూరజ్ ఫాస్ట్‌ఫుడ్, మలయాళం చర్చి, లేబర్ ఆఫీస్, టెలిఫోన్ ఎక్స్ఛేంజి పక్కన లేన్‌లలో చేపట్టిన నూతన సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పర్యవేక్షించారు. బీజేపీ నేతలు వినయ్‌కుమార్, దామోదర్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి



మాట్లాడుతున్న సెంట్రల్‌జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ యాదగిరి, సీఐ ఎండీ అంజద్‌అలీ

అంబర్‌పేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం శనివారం అంబర్‌పేటలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ సమాజంలో సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు పెరగడంతో ప్రజలను సులువుగా మోసగించడానికి సైబర్ మోసగాళ్లు మోసపూరితమైన యాప్‌లను పంపించి వారి నుంచి డబ్బులు దోచుకుంటున్నారని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, తమకు వచ్చే అపరిచిత కాల్స్‌కు జవాబు ఇవ్వరాదని సూచించారు. ఏపీకే యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోరాదన్నారు. సైబర్‌మోసాలకు గురైనట్లు భావిస్తే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ డివిజన్ ఏసీపీ వై.హరీష్‌కుమార్, అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, వారసిగూడ, లాలగూడ, కాచిగూడ, సుల్తాన్‌బజార్, నల్లకుంట, ఓయూ, చిలకలగూడ పీఎస్‌ల సీఐలు, డీఐలు, ఈస్ట్‌జోన్ సైబర్ క్రైమ్ సిబ్బంది, పలు పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఏవి కళాశాలలో..

కవాడిగూడ : సైబర్‌నేరాలు మోసాలతోపాటు మాదకద్రవ్యాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్‌జోన్ అడిషనల్ డీసీపీ బి. ఆనంద్ సూచించారు. సైబర్‌నేరాలు, డిజిటల్ అరెస్టులు, మాదకద్రవ్యాలపై దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏవి కళాశాలలోని ఆడిటోరియంలో గ్రూప్ 2 విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా సురక్షితంగా ఉండేందుకే ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. సైబర్‌క్రైమ్, మాదకద్రవ్యాలు, ఏపీకే ఓటీపీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ యాదగిరి, దోమలగూడ సీఐ ఎండీ అంజద్‌అలీ, దోమలగూడ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితర సిబ్బందితో పాటు గ్రూప్ 2 అభ్యర్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్ పీఎస్ పరిధిలో..

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జీరాలోని ప్రభుత్వ పాఠశాలలో సైబర్ అవర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని ఈసందర్భంగా విద్యార్థులకు గాంధీనగర్ డీఐ వెంకటేశ్వర్లు సూచించారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ కాన్ఫరెన్స్‌హాల్‌లో..

చిక్కడపల్లి : సైబర్‌నేరాలు, డిజిటల్ అరెస్టులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, చిక్కడపల్లి డీఐ ఎం.శంకర్ సూచించారు. డిజిటల్ అరెస్టు బెదిరింపు కాల్స్‌కు భయపడకుండా 1930, 100 నెంబర్లకు డయల్‌చేసి సమాచారం అందించాలన్నారు. సైబర్‌నేరాలపై చిక్కడపల్లి పోలీసులు చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకింగ్‌కు సంబంధించిన ప్రైవేట్ సమాచారం ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్తపడాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ, ముషీరాబాద్ డీఐ నదీమ్, గ్రంథాలయ ఉద్యోగులు, నిరుద్యోగ విద్యార్థులు, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్‌పాయిస్ కళాశాలలో..

ముషీరాబాద్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం రాంనగర్ సెయింట్‌పాయిస్ కళాశాలలో సైబర్‌క్రైమ్ అవర్నెస్ ప్రోగ్రాంను ముషీరాబాద్ పోలీసులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా జరుగుతున్నాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్‌లు, పరిచయంలేని వారితో చాటింగ్‌లు తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ సీఐ రాంబాబు, డీఐ నదీం హుస్సేన్, ఎస్ఐలు రాజేష్, దుర్గాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు : ఎమ్మెల్యే గోపాల్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న కనీస సౌకర్యాల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని అరవింద్‌నగర్‌కాలనీలో నూతనంగా రూ.14లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవాడిగూడ అరవింద్‌నగర్ కాలనీలో రోడ్డు అధ్వానంగా మారవడంతో పాటు ఓమ్యాన్‌హోల్ వద్ద పెద్దగొయ్యి ఏర్పడడంతో నూతన రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించి నూతన సీసీరోడ్డు నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిధులు విడుదల కావడంతో అరవింద్‌నగర్‌కాలనీలోని వినాయక ఆలయం నుంచి నాలా వరకు నూతన రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యాంయాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్ఎస్ నగర్‌నాయకులు ఆర్ రాంచందర్, రాజేష్, రాజశేఖర్‌గౌడ్, గద్దె వేణు, ప్రభాకర్, సంతోష్, శ్రీకాంత్, దూలం శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, నాగులు, ముచ్చకుర్తి ప్రభాకర్, మధు, అరవింద్‌నగర్ కాలనీవాసులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సన్ని, ఏఈ వినోద్, వర్క్సుఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలి

● నేడు ఇందిరాపార్కు వద్ద బీసీల న్యాయసాధన దీక్ష



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని బీసీ జేఏసీ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఈనెల 16న ఇందిరాపార్కు వద్ద బీసీల న్యాయసాధన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఇప్పటికీ 130సార్లు సవరించారని, బీసీ రిజర్వేషన్‌లకు రాజ్యాంగ భద్రత కల్పించడానికి మరొకసారి రాజ్యాంగాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, అఖిలపక్షాన్ని బీసీ ప్రజా సంఘాల ప్రతినిధులను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోదీని కలిసి విన్నవించాలని ఆయన కోరారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించే న్యాయసాధన దీక్షకు వేలాదిగా బీసీలు తరలిరావాలని ఆయన కోరారు. బీసీ సంఘాల నేతలు నీలా వెంకటేష్, సతీష్, రాజ్‌కుమార్, రాందేవ్‌మోదీ పాల్గొన్నారు.

ఆట, పాటలే సామాజిక ఆయుధాలు

రాంనగర్: ఆట, పాటలే సామాజిక ఆయుధాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. నృత్యం ద్వారానే భావాలు ప్రజలకు చేరవెయ్యాలని వారన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సురభారతి సంగీత కళాకేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కోవిదా ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు పి.అనూహ్యారెడ్డి, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, పి.ఎస్.మూర్తి, శ్రీరామ్‌దత్తు, డాక్టర్ పి.జానకిదేవి, ఆచార్య ఘంటసాల పవన్‌కుమార్, జి.లావణ్య, కె.రామలక్ష్మి, డి.రాధిక, శ్రీనివాస్, కె.స్వర్ణలత, ఏ.అనుదీప్తి, సీ.హెచ్.వీరభద్రరావు, అరుణ శ్రీనివాస్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'రాజ్యాధికారం ద్వారానే సామాజిక న్యాయం'

చిక్కడపల్లి : బహుజనులకు రాజ్యాధికారం ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుందని మార్క్సిస్టు, అంబేడ్కరిస్టు రాజకీయ విశ్లేషకుడు సాదు మాల్యాద్రి అన్నారు. బహుజనలెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ ఆధిపత్యకులాల యాజమాన్యంలో ఉండడం వల్లే బహుజనులకు న్యాయం జరగడం లేదన్నారు. బహుజన లెఫ్ట్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సబ్బని లత, శ్రీశైలం, సాయికృష్ణ, ప్రవీణ్, ఆంజనేయులు, ప్రభు, సంజయ్ పాల్గొన్నారు.

'పీ అండ్ టీ కాలనీ అభివృద్ధికి రామకృష్ణ సేవలు మరువలేనివి'

ముషీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పీఅండ్‌టీకాలనీ అభివృద్ధికి దేవరకొండ రామకృష్ణ అందించిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ కొనియాడారు. ఇటీవల చెట్టుకొమ్మ విరిగి మీదపడడంతో మృతిచెందిన రామకృష్ణ సంతాపసభను పీఅండ్‌టీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీకాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఅండ్‌టీకాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేసేవారని అన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఅండ్‌టీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రామకృష్ణ, లత, కోశాధికారి సంతోష్, బీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ప్రవీణ్, కె.ఎం సాయి, కృష్ణ పాల్గొన్నారు.

రూ.100కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం నేతల డిమాండ్



మాట్లాడుతున్న దినేష్‌పాటిల్ తదితరులు

రాంనగర్ : వీరశైవ లింగాయత్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రకటించి వెంటనే నూతన పాలక మండలిని నియమించి 100 కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర వీరశైవలింగాయత్, లింగబలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల సంఘమేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు దినేష్‌పాటిల్, ప్రధాన కార్యదర్శి కళ్లపల్లి రాచప్పలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోకాపేటలో తమకు కేటాయించిన భూమి రీ టెండర్‌ను పిలిచి రూ.25కోట్లతో భవనాన్ని నిర్మించాలని, వీరశైవ లింగాయత్, లింగబలిజలను ఓబీసీలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం అధ్యక్షుడిగా దినేష్‌పాటిల్, ప్రధాన కార్యదర్శి కళ్లపల్లి రాచప్ప. కోశాధికారిగా పట్లోళ్ల శివకుమార్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా శెట్టి శివకుమార్, మహిళా అధ్యక్షురాలిగా విద్యుత్‌లత, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, యూత్ అధ్యక్ష, కార్యదర్శులుగా చరణ్, సోమేష్ నియమితులయ్యారు.


రాంనగర్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

● జనవరి 11 వరకు 50శాతం నుంచి 70శాతం వరకు తగ్గింపు ధరలకు అమ్మకాలు



రాజ్ ఫంక్షన్ హాల్‌లో చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ముషీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం(తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) ఆధ్వర్యంలో రెండు నెలలుగా కొనసాగుతున్న చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. దీంతో మరో రెండు నెలల పాటు ప్రదర్శన, అమ్మకాలకు గడువు పెంచారు. టెస్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శైలజా రామయ్యార్ ఆదేశాలతో 2026 జనవరి 11వ తేదీ వరకు ప్రత్యేక తగ్గింపు ధరల్లో వివిధ రకాల చేనేత వస్త్రాలను అమ్మకాలు కొనసాగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత వస్త్రాలు పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట్, సిద్దిపేట గొల్లభామ, కాటన్, పట్టు చీరలు తక్కువ ధరలకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మంగళగిరి, బందరు, కలంకారి వస్త్రాలు, వరంగల్ వస్త్రాలు, దుప్పట్లు, రెడీమేడ్ వస్త్రాలు, లుంగీలు, టవల్స్, కట్‌చిప్స్ తదితర నాణ్యమైన చేనేత వస్త్రాలు తగ్గింపు ధరలకు ప్రజలకు అందిస్తున్నారు. యువతులను ఆకర్షించేందుకు డ్రెస్ మెటీరియల్స్ సైతం అందుబాటులో ఉంచారు. మహిళలకు కావల్సిన అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉండడంతో పాటు తక్కువ ధరకే లభిస్తుండడంతో వారిని ఆకట్టుకుంటున్నాయి. బయట మార్కెట్‌లో కంటే అతి తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలు లభిస్తుండడంతో జనం పెద్దఎత్తున తరలివచ్చి కొనుగోలు చేస్తున్నారు. పండుగల సందర్భాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లో సైతం పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ప్రస్తుతం పెండ్లీల సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా పెద్దఎత్తున వచ్చి తమకు నచ్చిన వస్త్రాలను తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. గత రెండు నెలల్లో సుమారు రూ.కోటి60లక్షలకు పైగా వస్త్రాల అమ్మకాలు జరిగాయని అధికారులు పేర్కొంటున్నారు.



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ కదివరన్, ఉపేందర్‌రెడ్డి

ఉత్తమగ్రంథాలు చదవడం అలవాటు చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ పళని కదిరవన్

చిక్కడపల్లి : ఆరోగ్యకర జీవనంలో భాగంగా ఉత్తమగ్రంథాలు చదవడం అలవాటు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పళని కదిరవన్ యువతకు సూచించారు. చిక్కడపల్లిలోని నగరకేంద్రగ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివా రం గ్రంథాలయ ప్రాంగణంలో పుస్తకప్రదర్శన ప్రారంభమైంది. ప్రదర్శనను ప్రారంభించిన పళని కదిరవన్ మాట్లాడుతూ జ్ఞానసముపార్జనకు గ్రంథాలయా లు దోహదం చేస్తాయన్నారు. ఈసందర్భంగా హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జాతీయ గీత రచయిత అందెశ్రీ రచించిన నిప్పుల వాగు పుస్తకాన్ని ప్రదర్శనలో ప్రదర్శించామని, అందెశ్రీ పాటలు, రచనలు తెలంగాణ ఉద్యమం ముందుకు సాగడానికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. కార్యదర్శి పొట్లూరు పద్మజ నివేదిక సమర్పించారు. గ్రంథాలయ ఉద్యోగులు ఎల్ చంద్రకళ, ప్రతిభారెడ్డి, అవినాష్, వెంకటేశ్వరరెడ్డి, బొల్లం మహేందర్, హరిబాబు, శంకర్, జంగారెడ్డి, మహేష్, ఈశ్వర్, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కవిత్వ శిక్షణ కార్యశాలల సంఖ్య పెరగాలి : ఇనాక్



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

రాంనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : యువ కవులకు కవితా నిర్మాణాలపై శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలాసాహితీ సమితి ఆధ్వర్యంలో యువకవులకు ఆధునిక వచన కవిత నిర్మాణ పద్ధతులపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెల్లి విద్యాధర్ రచించిన కోహినూర్, ముసాఫిర్ తెలుగు కవితా సంపుటాల ఆంగ్లానువాద గ్రంథాలను కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కవిత్వ కార్యశాలలో ప్రపంచ కవితా నిర్మాణాలపై బిక్కి కృష్ణ, ఆధునిక కవిత్వంపై వస్తు వైవిధ్యంపై డాక్టర్ నాళేశ్వరం శంకరం, వచన కవిత్వం అభివ్యక్తి నవ్యతపై శైలజామిత్రలు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్ కవిత్వంపై కీలకోపన్యాసం చేశారు. బిక్కి కృష్ణ రాసిన కవిత్వం డిక్షన్ పుస్తకాన్ని డాక్టర్ రాధాకుసుమ పరిచయం చేశారు. పద్మశ్రీలత వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కవిత్వ కార్యశాలలో కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్

● ముగ్గురు నిందితుల అరెస్ట్



నకిలీ డాక్యుమెంట్లతో ఇతరుల ప్లాటును అమ్మిన కేసులో అరెస్టైన నిందితులు

ఉప్పల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లతో ప్లాటును రిజిస్ట్రేషన్ చేయించుకొని కబ్జా చేసేందుకు యత్నించిన ముఠా సభ్యులను ఉప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్‌బీనగర్ కొత్తపేటలో నివాసముండే విజయకుమారికి 1993లో తన పుట్టింటివారు కట్నం కింద ఉప్పల్ సాయిబాబా కాలనీలో 200 గజాల ప్లాటును ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఆ ప్లాటుపై కబ్జా దారుల కన్నుపడింది. పథకం ప్రకారం.. ప్లాటు యజమాని చనిపోయినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారుచేసి ఆమెకు వారసురాలిగా ఆమె కూతురు రమ్య ఉన్నట్లుగా నకిలీ వ్యక్తిని సిద్ధం చేసి, ఆమె పేరుతో వారసురాలి సర్టిఫికెట్ తయారు చేశారు. రమ్య నుంచి ఆ ప్లాటును ఉప్పల్‌కు చెందిన రచల వెంకటరమణ పేరు మీద, ఆ తర్వాత రంగ సతీష్‌గౌడ్ పేరు మీద ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ ప్లాటులో మరో 100 గజాల స్థలాన్ని చాకలి లక్ష్మీదేవికి అమ్మారు. దీంతో ఆమె ప్లాటు వద్దకు వెళ్లేసరికి ప్లాటు అసలు యజమాని అక్కడికి చేరుకోవడంలో తాను మోసపోయిన విషయాన్ని తెలుసుకొని న్యాయం కోసం ఆమె ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముగ్గురు నిందితులు గతంలో అనురాధ రఘురామ్ అనే వ్యక్తి బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఆతని ప్లాటును ఉపేందర్ అనే వ్యక్తికి అమ్మినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులకు సహకరించిన కార్తీక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.